సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం ¦ 26 ¦ సెప్టెంబర్ ¦ 2025



.. ఉత్సవాలు వెలవెల

ప్రచారలోపం, అరకొర వసతులతో పాల్వంచ పెద్దమ్మగుడిలో శరన్నవరాత్రి వేడుకలు ఈ ఏడాది వెలవెలబోతున్నాయి. 10లో



ప్రైవేటు బస్సుల్లో అధిక చార్జీలు!

దసరా సెలవుల వేళ ప్రైవేట్ బస్సుల్లో టికెట్ ధరలు రెండు, మూడింతలు పెంచి ప్రయాణికుల జేబులు ఖాళీ చేస్తున్నారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 30° / 25°

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శ్రీ గాయత్రీదేవిగా పెద్దమ్మతల్లి



శ్రీ గాయత్రీదేవిగా అమ్మవారు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారు శ్రీ గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి అలంకరణ విశిష్టతను అర్చకులు వివరించారు.

రామయ్యను దర్శించుకున్న సీఆర్పీఎఫ్ ఐజీ

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కర్ణాటక రాష్ట్ర సీఆర్పీఎఫ్ ఐజీ విపుల్ కుమార్ గురువారం దర్శించుకున్నారు. రామయ్య సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం ఉపాలయాలను సందర్శించగా, ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ సమితిలో ఇద్దరికి చోటు



కూనంనేని సాంబశివరావు



ఎస్‌కె సాబీర్‌పాషా

సూపర్‌బజార్(కొత్తగూడెం): చండీఘర్‌లో ఐదు రోజులుగా జరుగుతున్న సీపీఐ జాతీయ మహాసభలు గురువారం ముగిశాయి. చివరి రోజున ఎన్నుకున్న కమిటీలో.. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కార్యవర్గ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. కూనంనేని 2005 నుంచి 2009 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2009, 2023లో కొత్తగూడెం ఎమ్మెల్యేగా విజయం సాధించారు. సాబీర్‌పాషా విద్యార్థి దశ నుంచే చురుకైన పాత్ర పోషించి, యువజన, కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఏడేళ్ల పాటు ఏఐఎస్‌ఎఫ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా, కార్యదర్శిగా, 2001లో ఉమ్మడి ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 2002లో సీపీఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శిగా ఎంపికయ్యారు. భద్రాద్రి జిల్లా ఆవిర్భావం నుంచి జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

ఓయూ నుంచి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన ప్రకాశ్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడేనికి చెందిన భూక్యా ప్రకాశ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ ఎం.వి.కృష్ణారావు పర్యవేక్షణలో 'జియోపాలిమర్ కాంక్రీట్' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఖమ్మంలో బీ.టెక్, హైదరాబాద్‌లో ఎం.టెక్ చదివి ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ సర్కిల్–29, టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎస్‌ఏసీ సైట్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. తన డాక్టరేట్‌ను తల్లిదండ్రులు కిషన్, చంద్రిలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

నిధుల్లేక నీరసం..

అప్పుల్లో పంచాయతీ కార్యదర్శులు

- ఏడాదిన్నరగా విడుదల కాని నిధులు
- వీధి లైట్లు వేసేందుకూ ఇబ్బందులే
- బతుకమ్మ సంబరాల వేళ అంధకారంలో గ్రామాలు



సారపాక పంచాయతీ గాంధీనగర్‌లో పేరుకుపోయిన చెత్త



బూర్గంపాడు: గ్రామ పంచాయతీలకు ఏడాదిన్నర కాలంగా నిధులు రాక పల్లెలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. వర్షాకాలం కావడంతో వీధులన్నీ బురదమయంగా మారాయి. రాత్రి వేళ కనీసం వీధిలైట్లు కూడా వేయలేని పరిస్థితుల్లో గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి. ప్రస్తుతం బతుకమ్మ వేడుకలు జరుగుతుండగా రాత్రి అయిందంటే చీకట్లో వెళ్లలేక ఆడపడుచులు ఇబ్బంది పడుతున్నారు. ఇంతకాలం సొంత డబ్బుతో గ్రామాల్లో పనులు చేయించిన పంచాయతీ కార్యదర్శులు అప్పుల్లో కూరుకుపోయారు. ట్రాక్టర్ల డీజిల్, రిపేర్లు, తాగునీటి సరఫరాలో లైన్ల మరమ్మతులకు కూడా నిధుల కొరత వేధిస్తోంది. వీధుల్లో బురద పేరుకుపోగా బ్లీచింగ్ కొనేందుకు సైతం డబ్బు లేక కార్యదర్శులు ఏ పనీ చేయలేకపోతున్నారు.

పేరుకుపోతున్న చెత్త..

2024 జనవరిలో గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. నాటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. పాలకవర్గాలు లేకపోవడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 18 నెలలుగా నిధులు నిలిచిపోవడంతో పంచాయతీ కార్యదర్శులపై భారం పడుతోంది. పలు గ్రామ పంచాయతీల కార్యదర్శులు అప్పులు చేసి అత్యవసర పనులు చేయిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సైతం చేపట్టలేక ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. ఇక ఇంటి పన్నులు, వార సంతల నిర్వహణ, దుకాణాల అద్దె, ఇతరత్రా వస్తున్న ఆదాయాన్ని పంచాయతీల జనరల్ ఫండ్ ఖాతాలో జమచేయాలి. అయితే జనరల్ ఫండ్ నిధులను ప్రభుత్వం ఫ్రీజింగ్‌లో పెట్టడంతో కార్యదర్శులు కనీసం ఆ డబ్బు కూడా వాడుకునే అవకాశం లేదు. ఫ్రీజింగ్ తొలగించి ఆ నిధులు వాడుకునే అవకాశం కల్పించాలని, తద్వారా కనీస అవసరాలైనా తీర్చొచ్చని కార్యదర్శులు అంటున్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికే చిన్న పంచాయతీల కార్యదర్శులు రూ.2 లక్షలకు పైగా, పెద్ద పంచాయతీల వారు రూ.6లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అప్పు చేసి వివిధ పనులు చేయించారు. అయితే ప్రస్తుతం తమకు అప్పు ఇచ్చేవారు కూడా లేరని గ్రామపంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో నలిగిపోతున్నాం



గ్రామపంచాయతీలకు 18 నెలలుగా నిధులు రాకపోవడంతో క్షేత్రస్థాయిలో నలిగిపోతున్నాం. గ్రామాల్లో ఏ పని చేయాలన్నా ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. చాలా మంది కార్యదర్శులు సాధ్యమైనంత మేర అప్పులు తెచ్చి పనులు చేయిస్తున్నారు. ప్రస్తుతం అప్పులు కూడా పుట్టని పరిస్థితి నెలకొంది. జనరల్ ఫండ్‌ను వినియోగించుకోవాలంటే ట్రెజరీలో ఫ్రీజింగ్ నడుస్తోంది.

– కిరణ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు

లైట్లు వెలగవు.. బ్లీచింగ్ చల్లరు..

ప్రస్తుతం బతుకమ్మ, దసరా పండుగ వేళ గ్రామాలలో సందడి వాతావరణం నెలకొంది. సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు మహిళలు బతుకమ్మ ఆడుతున్నారు. ఆ సమయంలో వీధిలైట్లు వెలగకపోవడంతో పంచాయతీ కార్యదర్శులపై తీవ్రమైన ఒత్తిడి వస్తోంది. ఇక వర్షాలు పడుతుండగా వీధుల్లో బ్లీచింగ్ చల్లాలి. కానీ బ్లీచింగ్, వీధి లైట్ల కొనుగోలుకు డబ్బులు లేక కార్యదర్శులు సతమతం అవుతున్నారు. స్థానికంగా సోషల్ మీడియా గ్రూప్‌ల్లో వెలగని వీధిలైట్ల ఫొటోలు పెడుతున్న కొందరు పంచాయతీ కార్యదర్శులను నిలదీస్తున్నారు. బతుకమ్మ నిమజ్జనాల కోసం వాగులు, నదులు, చెరువుల వద్ద పంచాయతీ ఆధ్వర్యంలో ఘాట్‌లు ఏర్పాటు చేయాలి. ఈ పనులన్నింటికీ నిధుల కొరత వేధిస్తుండగా కార్యదర్శులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మల్టీపర్పస్ వర్కర్లకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు. ఈ క్రమంలో వారు కూడా పండుగ ఎలా జరుపుకోవాలంటూ పంచాయతీ కార్యదర్శులనే నిలదీస్తున్నారు.

గజలక్ష్మిగా జగన్మాత

నేడు ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు





నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) గజలక్ష్మి అలంకరణలో అమ్మవారు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం లక్ష్మీతాయారు అమ్మవారిని.. చెదరని అధికారం, తరగని సంపదను ప్రసాదించే గజలక్ష్మి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చన నిర్వహించగా మహిళలు భారీగా హాజరయ్యారు. కాగా, చిత్రకూట మండపంలో జరుగుతున్న శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేద పండితులు, అర్చకులు అయోధ్య కాండ పారాయణం చేశారు.

నేటి ధనలక్ష్మి అలంకార విశిష్టత..

'హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం..' అంటూ శ్రీ సూక్తం అమ్మవారిని ధనలక్ష్మిగా కీర్తిస్తుంది. ధనం అంటే కేవలం డబ్బు మాత్రమే కాదు. విద్య, బలం, కీర్తి మొదలైనదంతా ధనమేనని, విద్యాధనం, హిరణ్య ధనం, శక్తి ధనాలను ప్రసాదిస్తుంది కాబట్టే ఈ అమ్మకు ధనలక్ష్మిగా పేరని, ముగ్గురమ్మల శక్తిని భక్తులకు పంచుతుందని పండితులు చెబుతున్నారు.

నేత్రపర్వంగా రామయ్య కల్యాణం

శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

బాధ్యతగా స్వచ్ఛత పాటించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



పిచ్చి చెట్లను తొలగిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అధికారులు

చుంచుపల్లి: ప్రతీ పౌరుడు బాధ్యతగా స్వచ్ఛత పాటించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో శ్రమదానం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు విశ్వవిద్యాలయ ఆవరణలో గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ మాట్లాడుతూ ఇంటి నుంచి సమాజం వరకు ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడవేయొద్దని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతేనని పేర్కొన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో నాగలక్ష్మి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, మున్సిపల్ కమిషనర్ సుజాత, మైనింగ్ ఏడీ దినేష్, గ్రౌండ్ వాటర్ ఏడీ రమేష్, మెప్మా పీడీ రాజేష్, ఉద్యోగులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్' నిలిపివేయాలి



మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న విమలక్క



బతుకమ్మతో వస్తున్న విమలక్క

- కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాల్సిందే..
- బహుజన బతుకమ్మ రాష్ట్ర కన్వీనర్ విమలక్క

పాల్వంచరూరల్: అటవీ సంపదను కొందరికి కట్టబెట్టాలంటే మావోయిస్టులను చంపేస్తే అడ్డు ఉండదనే భావనతో పాలక వర్గాలు చేపడుతున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్రం శాంతిచర్చలు జరపాలని, అప్పుడే శాంతి నెలకొంటుందని బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ విమలక్క అన్నారు. పాల్వంచ మండలం ఉల్వనూరులో గురువారం నిర్వహించిన బహుజన బతుకమ్మ కార్యక్రమంలో పాల్గొన్న విమలక్క గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని గిరిజనుల నివాసాలు, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల మైదానంలో బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతిని విధ్వంసం చేయడమంటే ప్రజలపై యుద్ధం చేయడమేనని తెలిపారు. అలా కాకుండా ప్రకృతి రక్షణే ప్రజల రక్షణగా భావించాలని సూచించారు. బహుజనులు పంచ భూతాలను కాపాడుతుంటే బహుళ జాతి కంపెనీలు వాటిని కబళిస్తున్నాయని ఆరోపించారు. వనరుల విధ్వంసం, వివక్షత, ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా బహుజన బతుకమ్మ ఇక్కడికి కదిలి వచ్చిందని తెలిపారు. బహుళ పంటలతో విలసిల్లాల్సిన తెలంగాణ ఏకపంటల పద్ధతితో వలసలు పెరిగిపోతున్నాయని చెప్పారు. ఈమేరకు ప్రకృతికి మూలమైన ఆడబిడ్డలు, దేశ మూలవాసులు ఆదివాసీలతో పాటు అడవులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎన్‌కౌంటర్లు లేని, ఆదివాసీ బిడ్డలు ఊపిరి పీల్చుకునే, పిల్లల భవిష్యత్ మంచిగా ఉండే తెలంగాణను అంతా కోరుకుంటున్నారని విమలక్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ, వాసం రుద్ర, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లకు రెడీ..

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- అక్టోబర్ 18 వరకు గడువు, 23న డ్రా
- ఫీజు గతేడాది కంటే రూ.లక్ష పెంపు



రిజర్వేషన్లకు లాటరీ తీసి చూపిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్: నూతన మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తు చేసేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. శుక్రవారం నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించనుండగా, అదే నెల 23న డ్రా తీస్తారు. టెండర్లు దక్కించుకున్న వారు డిసెంబర్ 1 నుంచి మద్యం దుకాణాలను ప్రారంభించాల్సి ఉంటుంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న దుకాణాలకు నవంబర్ 30తో గడువు ముగియనుంది. ప్రస్తుతం దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో పలువురు దరఖాస్తుదారులు అమ్మవారి ఆలయాలు, మండపాల వద్ద పూజలు జరిపించి టెండర్లు వేసే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. అయితే గతేడాది కంటే ఈ సంవత్సరం టెండర్ ఫీజు రూ. లక్ష పెంచడంతో దరఖాస్తుదారులకు అదనపు భారం కానుంది.

జిల్లాలో 88 వైన్స్..

జిల్లాలో ప్రస్తుతం 88 వైన్స్ ఉన్నాయి. 2023లో జరిగిన మద్యం దుకాణాల టెండర్ ప్రక్రియలో రూ.2 లక్షల ఫీజుతో మొత్తం 5,057 దరఖాస్తులను స్వీకరించిన ఎక్సైజ్ అధికారులు డ్రా పద్ధతిలో 88 మందికి లైసెన్స్‌లు జారీ చేశారు. ప్రస్తుతం దరఖాస్తు ఫీజును రూ.3 లక్షలకు పెంచినా పాతవారు మాత్రం పెద్దగా స్పందించడం లేదు.

ఏర్పాట్లు చేస్తున్న అధికారులు..

జిల్లాలో కొత్త మద్యం దుకాణాలకు శుక్రవారం నుంచి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా కొత్తగూడెంలోని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేటల్లో ఆయా స్టేషన్ల పరిధిలోని వారు ఆయా కార్యాలయాల్లో దరఖాస్తులు అందించేలా కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఫీజు గతేడాది కంటే రూ.లక్ష పెంచడంతో ప్రభుత్వానికి ఆదాయం పెరిగే అవకాశం ఉన్నా.. దరఖాస్తుదారుల సంఖ్య గతం కంటే తగ్గొచ్చనే అంచనాలు కూడా ఉన్నాయి. కొత్త మద్యం దుకాణాలు డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానుండగా 2027 నవంబర్ 30 వరకు కాలపరిమితి ఉంటుంది.

దరఖాస్తులకు రిజర్వేషన్లు ఖరారు

జిల్లాలో కొత్త మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునేందుకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో గురువారం లాటరీ పద్ధతిన రిజర్వేషన్లు ఖరారు చేశారు. జిల్లాలో ఏ–4 మద్యం దుకాణాలు 88 ఉండగా, 44 షాపులను ఏజెన్సీ ఎస్టీలకు రిజర్వ్ చేశారు. మిగిలిన 44 షాపుల్లో ఎస్సీలకు ఏడు, గౌడ కులస్తులకు ఆరు, జనరల్ వారికి 31 కేటాయించారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



కొత్త మద్యం దుకాణాల కోసం టెండర్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశాం. స్టేషన్ల వారీగా దరఖాస్తులు స్వీకరిస్తాం. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. శుక్రవారం నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం.

–జానయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఎవరికీ పట్టని ఆదివాసీల వ్యథ

- ఎంత పోరాడినా పరిష్కారం కాని భూ సమస్య
- నాలుగు రోజులుగా ధర్నాచౌక్‌లో రామన్నగూడెం వాసుల నిరాహారదీక్ష



గురువారం రాత్రి ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అశ్వారావుపేట మండలం రామన్నగూడెంలో 150 మంది ఆదివాసీ రైతులకు సంబంధించిన 573.20 ఎకరాల భూమి విషయంలో అటవీ, ఎఫ్‌డీసీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదం కొనసాగుతోంది. ఉమ్మడి ఏపీగా ఉన్న కాలం నుంచే రైతులు అనేక పోరాటాలు చేసినా భూములు మాత్రం దక్కలేదు. ప్రభుత్వం పాస్ పుస్తకాలు ఇచ్చిందని, ఈ భూమి తమదేనంటూ హైకోర్టు సైతం 2011లో తీర్పు చెప్పిందని, అయినా భూమి మాత్రం తమకు దక్కలేదని ఆదివాసీలు అంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గత జూన్ 9న ఆదివాసీలంతా కలిసి మూడురోజుల పాటు రామన్నగూడెం నుంచి కలెక్టరేట్‌కు పాదయాత్రగా వచ్చి ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ వారి వద్దకు వచ్చి సమస్యను కలెక్టర్‌కు వివరించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అయితే మూడు నెలలు గడిచినా పరిష్కారం కాకపోవడంతో తిరిగి కలెక్టరేట్ పక్కన అధ్వాన స్థితిలో ఉన్న ధర్నాచౌక్ వద్ద శుభ్రం చేసుకుని పిల్లాపాపలతో నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ ఆందోళన గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. అక్కడే వంటావార్పు చేసుకుంటూ, విద్యుత్ సౌకర్యం లేకున్నా టార్చిలైట్ల వెలుతురులో కాలం గడుపుతున్నారు. ఎలాంటి సౌకర్యాలు లేని ధర్నాచౌక్‌లో ఇబ్బందులు పడుతూ నిరాహారదీక్ష చేస్తున్నా ఆదివాసీల ఆందోళన నాలుగు రోజులుగా బయటి ప్రపంచానికి తెలియలేదు. గురువారం జీఎస్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ఆరేం ప్రశాంత్, పాల్వంచ మాజీ ఎంపీపీ మడవి సరస్వతి, ఆదివాసీ నాయకులు సోయం సత్యనారాయణ, సోయం లక్ష్మయ్య, పూనెం నాగేశ్వరరావు వారికి మద్దతు తెలపగా ఈ విషయం వెలుగుచూసింది. కాగా, తమ సమస్యను పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కార్యదర్శి మడకం నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టాలి

అశ్వారావుపేటరూరల్: పెండింగ్ కేసులపై దృష్టి సారించి పరిష్కరించాలని ఎస్పీ రోహిత్‌రాజ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. శాంతి భద్రతలు, రోడ్డు ప్రమాదాలు, చోరీ కేసులపై సిబ్బందితో చర్చించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడంతో మత్తుపదార్థాలు, చోరీ ఘటనలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను కూడా సందర్శించి సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో సీఐ పింగళి నాగరాజు, ఎస్సైలు యయాతి రాజు, రామ్మూర్తి, అఖిల, సాయికిషోర్ రెడ్డి, టీజీఎస్పీ ఏఆర్ ఎస్సై రఘుపతి పాల్గొన్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీ సందర్శన

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని ఎస్పీ రోహిత్‌రాజ్ గురువారం సందర్శించారు. యంత్రాల పనితీరుపై బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. గెలల డంపింగ్ ప్లాట్ ఫామ్, బాయిలర్, పవర్ ప్లాంట్లను అధికారులతో కలిసి వీక్షించారు. అంతకుముందు మండల పరిధిలోని పామాయిల్ తోటలను పరిశీలించి సాగు విధానంపై రైతులతో చర్చించారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ రాధాకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి గ్రూప్ -1 కొలువులు



తాటి ప్రమోద్ సాయి



రమావత్ లక్ష్మీ ప్రసన్న



రేవంత్

దమ్మపేట/టేకులపల్లి/భద్రాచలం టౌన్ : గ్రూప్ -1లో జిల్లాకు చెందిన ముగ్గురు కొలువులు సాధించారు. దమ్మపేట మండలం తాటి సుబ్బన్నగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువకుడు తాటి ప్రమోద్ సాయి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ విభాగంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా మల్టీ జోన్ పరిధిలో ఉద్యోగం పొందనున్నారు. ఆయన తల్లి సుదర్శనమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు కాగా, తండ్రి చిన్నతనంలోనే రోడ్డు ప్రమాదంలో మరణించారు. ప్రమోద్‌సాయి పాఠశాల విద్య అనంతరం ఇంటర్, ఇంజనీరింగ్ హైదరాబాద్‌లో పూర్తి చేశారు. ఆ తర్వాత ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ తీసుకుని, సివిల్స్, గ్రూప్ -1 ఉద్యోగాలకు సన్నద్ధం కాగా గత మే నెలలో ప్రకటించిన రాత పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 317వ ర్యాంకు సాధించారు. టేకులపల్లి మండలం కొత్తతండా(పి) గ్రామానికి చెందిన రమావత్ లక్ష్మీప్రసన్న గ్రూప్–1లో సత్తా చాటి గ్రేడ్ - 2 మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం సాధించారు. నాగార్జునసాగర్‌కు చెందిన లక్ష్మీప్రసన్నకు తొమ్మిది నెలల క్రితం కొత్తతండాకు చెందిన బానోత్ జనార్దన్‌తో వివాహమైంది. పదో తరగతి వరకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో, ఇంటర్, ఎంబీబీఎస్ హైదరాబాద్‌లో చదివారు. ఆ తర్వాత యూపీఎస్‌సీ లక్ష్యంగా ఢిల్లీలో కోచింగ్ తీసుకుని పరీక్ష రాయగా మూడు సార్లు మెయిన్స్‌లో క్వాలిఫై అయినా ఇంటర్వ్యూలో ఉద్యోగం కోల్పోయారు. ప్రస్తుతం విజయం సాధించారు. కాగా, జనార్దన్ జీహెచ్‌ఎంసీలో టీపీబీఓగా పని చేస్తున్నారు. భద్రాచలం వైఎస్సార్ నగర్‌కు చెందిన ఎడారి రేవంత్ గ్రూప్–1లో మొదటి ప్రయత్నంలోనే డీపీఓగా ఉద్యోగం సాధించారు. స్థానిక సెయింట్ పాల్ స్కూల్‌లో పదో తరగతిలో ఉత్తమ ర్యాంక్, వరంగల్ ఐటీలో బీటెక్ సివిల్ ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. తన తండ్రి కలైన ఐఏఎస్ సాధించాలనేది జీవిత లక్ష్యమని రేవంత్ చెప్పాడు.

క్లుప్తంగా

వరిలో బెరుకులు

ఆందోళనలో రైతులు



వరిపొలంలో పరిశీలిస్తున్న అధికారులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సేద్యం చేసిన వరిపంటలో అధికంగా బెరుకులు కన్పిస్తున్నాయి. రాజాపురం, నామవరం గ్రామాల్లో 200 ఎకరాల్లో ఈ పరిస్థితి నెలకొంది. బీపీటీ 2782 సాంబ రకం పంటలో బెరుకులు సమస్య నెలకొంది. ఈ క్రమంలో బాధిత రైతులు గురువారం రాజాపురంలో సీడ్ డీలర్ షాపు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన వ్యవసాయ శాఖ అధికారి అనూష పంట పొలాలను పరిశీలించారు. సమస్యను జిల్లా అధికారులకు నివేదిస్తామని తెలిపారు.

మిరపనారులో కలుపు మందు పిచికారీ



మిరప నారును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు

ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు కలుపు మందు పిచికారీ చేయడంతో సలీం అనే రైతుకు చెందిన రెండు ఎకరాల మిరప నారు ఛిద్రమైంది. తనకు ఉన్న నాలుగు ఎకరాల భూమిలో మిరప సాగు చేసేందుకు రైతు మిరపనారు పోసుకున్నాడు. ఇప్పటికే రెండెకరాల్లో మొక్కలు నాటగా, మరో రెండెకరాల్లో నాటేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా, ఈ ఘటన జరిగింది. రైతు వ్యవసాయశాఖ, పోలీసులకు ఫిర్యాదు చేయగా, వ్యవసాయశాఖ అధికారులు మిరపనారును పరిశీలించారు.

జామాయిల్ తోటలో..

అశ్వాపురం: మండల పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన జమలపుడి వెంకటేశ్వర్లు ఎకరం జామాయిల్ తోటకు బుధవారం కొందరు వ్యక్తులు గడ్డిమందు కొట్టడంతో మొక్కలు ఎండిపోయాయి. మూడు నెలల క్రితం మొక్కలు నాటామని, గడ్డిమందు కొట్టడంతో ఎండిపోయాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రెండేళ్ల నుంచి భూ తగాదా జరుగుతోందని, ప్రత్యర్థులే గడ్డిమందు కొట్టారని బాధిత రైతు వెంకటేశ్వర్లు ఆరోపిస్తున్నాడు. ప్రతీ ఏటా పొలంలో వేసిన పంటను నాశనం చేస్తున్నారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తునే ఉన్నానని వాపోయాడు.

అట్రాసిటీ కేసులో డీఎస్పీ విచారణ

సుజాతనగర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై గురువారం కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ విచారణ నిర్వహించారు. మండలంలోని నాయకులగూడెం గ్రామానికి చెందిన చల్ల నర్సయ్య, పుల్లమ్మ, చల్ల అచ్చయ్య తమను కులం పేరుతో దూషించారని అదే గ్రామంలోని లెనిన్‌నగర్‌కు చెందిన దళితమహిళలు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో డీఎస్పీ వచ్చి విచారణ చేపట్టారు. బాధిత మహిళలతోపాటు దూషించిన వారిని విచారించారు. డీఎస్పీ వెంట చుంచుపల్లి సీఐ ఆర్.వెంకటేశ్వర్లు, సుజాతనగర్ ఎస్సై రమాదేవి ఉన్నారు.



విచారణ చేస్తున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107

ప్రచార లోపం.. ఉత్సవాలు వెలవెల

- పెద్దమ్మతల్లి ఆలయంలో తగ్గిన భక్తుల రద్దీ
- శరన్నవరాత్రుల వేడుకల నిర్వహణపై నిర్లక్ష్యం
- సమాచారం ఇవ్వకపోవడంతో పలువురు దాతల అసంతృప్తి



భక్తుల రాక తగ్గడంతో బోసిపోతున్న లడ్డూ కౌంటర్లు



పెద్దమ్మతల్లి ఆలయం

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లాలో మహిమాన్విత క్షేత్రంగా పేరొందిన శ్రీకనకదుర్గ ఆలయంలో ఈసారి శ్రీదేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు వెలవెలబోతున్నాయి. ప్రచారంలోపం, అరకొర వసతులతో పెద్దమ్మతల్లి ఆలయంలో జరుగుతున్న వేడుకలకు భక్తుల రద్దీ తగ్గింది. అధికారులు ప్రచారంపై దృష్టిపెట్టలేదని ఆరోపణలు వస్తున్నాయి.

ప్రారంభోత్సవానికి హాజరుకాని ఎమ్మెల్యే

మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ ఆలయంలో ఏటా దసరాకు ముందు శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఈ సారి ఈ నెల 22 నుంచి వేడుకలు ప్రారంభంకాగా, వచ్చే నెల 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఆహ్వానించినా హాజరుకాకపోవడంతో ఆలయ కమిటీ చైర్మన్ ద్వారానే కలశ పూజలు చేయించి ఉత్సవాలు ప్రారంభించారు. ఉత్సవాల సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి వేద పండితులను పిలిపించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది తక్కువ మంది మాత్రమే రావడంతో నామమాత్రంగానే పూజలు జరుపుతున్నారు.

ఏర్పాట్లు కరువు

ఉత్సవాల సందర్భంగా భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించలేదు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయి. దీంతో నవరాత్రులకు భక్తుల సంఖ్య తగ్గిపోయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల నుంచి నిత్యం భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఆదివారం అధిక సంఖ్యలో తరలివస్తారు. భద్రాచలం-కొత్తగూడెం జాతీయ రహదారిని ఆనుకునే ఆలయం ఉండటంతో, ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రతి ఒక్కరూ అమ్మవారి దర్శించుకుని వెళ్తారు. ఇంతగా ప్రసిద్ధి పొందిన ఆలయంలో ఈ సారి దసరా వేడుకలకు ఎండోమెంట్‌శాఖ సరైన ఏర్పాట్లు చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

18 మందికి రుత్వికులకు 12 మందే..

ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా ఏటా ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి అర్చకులు, రుత్వికులు వచ్చి 9 రోజులు పూజలు చేస్తుంటారు. గతేడాది 18 మంది రుత్వికులు వస్తే ఈసారి 12 మంది మాత్రమే వచ్చారు. పట్టణాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠ చేయడంతో అర్చకులు అటువైపే మొగ్గు చూపారని, ఆలయ ఉత్సవాలకు ఆసక్తి చూపలేదని సమాచారం.

విస్తృత ప్రచారం చేసి ఉంటే..

ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఇందుకోసం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తారు. ఈసారి దాతలకు, వీఐపీలకు ఉత్సవాల ఆహ్వాన పత్రికలు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదు. దీంతో అనేక మంది దాతలు ఈఓకు ఫోన్‌చేసి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రచారం విస్తృతస్థాయిలో జరిగి ఉంటే ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధికంగా వచ్చేవారు.

ఏటా రూ.2.5 కోట్లు, దసరాకు రూ.10 లక్షల ఆదాయం

గతేడాది నవరాత్రి ఉత్సవాలకు ఆలయ ముస్తాబు, రంగులు వేయడం, సిబ్బందికి, భక్తులకు నిత్యాన్నదానం, అర్చకులకు భత్యాలు తదితర ఖర్చులు రూ.10 లక్షలకుపైగా వ్యయం చేశారు. ఆదాయం కూడా అదేస్థాయిలో లభించింది. అయితే ఈసారి ఆదాయం తగ్గే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అమ్మవారి ఆలయం ద్వారా ఏటా ఎండోమెంట్‌శాఖకు రూ.2.50 కోట్లపైన ఆదాయం వస్తుంది. భక్తులు అమ్మవారికి వివిధ రూపంలో సమర్పించే కానుకల ద్వారా రూ.కోటి, 13 వ్యాపార దుకాణాల వేలం ద్వారా రూ.70 లక్షలు, చీరెల వేలం ద్వారా రూ.16 లక్షలు, కొబ్బరి చిప్పల వేలం ద్వారా రూ.16 లక్షలు, టికెట్ కౌంటర్ ద్వారా రూ.40 లక్షలు, తలనీలాలు ద్వారా రూ.9 లక్షల ఆదాయం లభిస్తుంది.

ఉత్సవాలకు ప్రచార లోపంలేదు



శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవాల ప్రచారంలో లోపం లేదు. నిత్యం వర్షాలు కురవడం, సెలవులు లేకపోవడంతో భక్తుల సంఖ్య తగ్గింది. తిథి ప్రాముఖ్యతలను బట్టి కూడా కొందరు భక్తులు దర్శించుకుంటారు. గురువారం, ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది.

–ఎన్.రజనీకుమారి, ఆలయ ఈఓ

గోదావరి ఘాట్ వద్ద భక్తుడిపై దాడి



గాయపడ్డ భక్తుడు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని గోదావరి ఘాట్ వద్ద స్నానం చేస్తున్న ఓ భక్తుడిపై అక్కడే ఓ దుకాణం నడుపుకుంటున్న యువకుడు రాయితో దాడి చేశాడు. స్థానికుల కథనం ప్రకారం.. గురువారం స్వామివారికి దర్శనానికి వచ్చిన మిర్యాలగూడకు చెందిన చెరుకు ఆంజనేయులు గోదావరిలో స్నానం ఆచరిస్తున్నాడు. ఆ సమయంలో ఘాట్ వద్ద దుకాణం నడుపుకుంటున్న సుధాకర్ అనే వ్యక్తి మరో భక్తుడిపై చేయి చేసుకునేందుకు వెళ్తున్నాడు. అడ్డుకోబోయిన ఆంజనేయులును దుర్భాషలాడుతూ రాయితో దాడి చేశాడు. అక్కడే ఉన్న కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. పైగా పోలీసులకు ఫిర్యాదు చేసుకోవాలంటూ బెదిరింపులకు దిగాడు. కాగా బాధితుడు ఆంజనేయులు స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక గ్రామ శివారు డంపింగ్ యార్డులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. 8 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, రూ.14 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యయాతీ రాజు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ అదనపు టవర్లతో మెరుగైన సేవలు



సమావేశంలో పాల్గొన్న టీఏసీ సభ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలో అవసరమైన చోట్ల బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటుచేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి క్యాంప్ కార్యాలయంలో గురువారం సభ్యులు సమావేశమయ్యారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీఎస్ఎన్ఎల్ ద్వారా మెరుగైన సేవలందేలా 189టవర్ల అవసరముందని టీఏసీ కమిటీ, అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యాన ఎంపీ ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. ఈ సమావేశంలో టీఏసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, అమరవాడి సత్యనారాయణరెడ్డి, బానోత్ రంజిత్ నాయక్, మచ్చా రామారావు, పల్లెల రామ లక్ష్మయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకుడు కొప్పుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇద్దరు యువకులపై కేసు నమోదు

పాల్వంచ: ఇద్దరు యువకులపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గాజులగూడెం రైల్వే ట్రాక్ సమీపంలో యువకులు గంజాయి సేవిస్తుండగా ఎస్‌ఐ జీవన్ రాజ్ ఆధ్వర్యంలో దాడి చేశారు. అజ్మీర రమేష్ అనే యువకుడు పట్టుబడగా, సాయికిరణ్ పరారయ్యాడు. 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పత్తి పంట ధ్వంసం

న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వేడుకోలు





ధ్వంసమైన పత్తి పంటను చూపుతున్న రైతులు (ఇన్‌సెట్) ఎమ్మెల్యేను అడ్డుకుంటున్న బాధితులు

టేకులపల్లి/గుండాల: ఆళ్లపల్లి మండలం రాయిపాడు గ్రామానికి చెందిన రైతులు ఊకే నాగేశ్వర్‌రావు -చంద్రకళ దంపతులు టేకులపల్లి మండలం మురళీపాడు బీట్‌లో ఎకరం భూమిలో పత్తి సాగు చేస్తున్నారు. నెలరోజుల్లో పంట చేతికి వచ్చే దశకు చేరింది.బుధవారం అర్ధరాత్రి అటవీశాఖ అధికారులు పత్తి పంటను ధ్వంసం చేశారు. గురువా రం ధ్వంసమైన పంటను చూసి రైతు కుటుంబం బోరున విలపించింది.

ఎమ్మెల్యేను అడ్డుకున్న రైతులు

ఆళ్లపల్లి మండలంలో పర్యటిస్తున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును రైతులు అడ్డుకున్నారు. న్యాయం చేయాలని బైఠాయించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పంట ధ్వంసం విషయమై వివరణ కోసం ఫారెస్టు రేంజర్‌కు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు



కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు



సింగరేణి కార్యాలయంలో..


సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో రెవెన్యూ, సివిల్ సప్లై శాఖల ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ విద్యాచందన, తహసీల్దార్లు గన్యా, భగవాన్ రెడ్డి, స్వర్ణలత, స్వాతిబిందు పాల్గొన్నారు.

సింగరేణి ప్రధాన కార్యాలయంలో..

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి ప్రధాన కార్యాలయంలో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం అధికారులు ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు జీవీ కిరణ్ కుమార్, కే.విజయలక్ష్మి వెంకటేశ్వర్లు, టి.సంధ్యారాణి,పి.సుమలత, కేసా నారాయణ రావు, బి.శివకేశవరావు, ముకుంద సత్యనారాయణ, నాయకులు ఎం.శ్యామ్ కిరణ్, ఎస్.పీతాంబర రావు, ఆర్.కేశవ రావు, కే.జానకి సాయిబాబు, జి.నాగబిందు పాల్గొన్నారు.

ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొంటే చర్యలు

- ప్రభుత్వ సీసీఏ రూల్స్ వీరికీ వర్తిస్తాయి
- రామాలయ వైదిక సిబ్బందికి జీఓ జారీ



భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం వెలుపల జరిగే ప్రైవేట్ వైదిక కార్యక్రమాలకు ఆలయ అర్చకులు, పండితులు హాజరు కావడానికి అనుమతి లేదని రామాలయ ఈఓ కొల్లు దామోదర్ రావు గురువారం ప్రకటనలో తెలిపారు. దేశ, విదేశాల్లో ఆలయ వైదిక సిబ్బంది తరుచుగా లోక కళ్యాణాలు, బ్రహ్మోత్సవాలు, ప్రవచనాలు, వేద సంహిత కార్యక్రమాలకు హాజరవుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు హాజరు కావటం క్రమశిక్షణను ధిక్కరించినట్లుగా భావిస్తున్నందున, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సీసీఏ రూల్స్ ప్రకారం వైదిక సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతి లేకుండా దేశ విదేశాల్లో ఎటువంటి వైదిక కార్యక్రమాలను నిర్వహించొద్దని, పాల్గొనద్దని తెలిపారు. ఈ ఉత్తర్వులను ధిక్కరిస్తే క్రమశిక్షణా చర్యలను తీసుకుంటామని పేర్కొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఈఓ మరో ప్రకటనలో తెలిపారు. 29న సాయంత్రం 5 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద జరుపుతున్నట్లు వెల్లడించారు.

ప్రైవేటు బస్సుల్లో అధిక చార్జీలు!

దసరాకు వచ్చే ప్రయాణికుల జేబులకు చిల్లు

- టికెట్ ధర మూడింతలు పెంచిన ట్రావెల్స్ నిర్వాహకులు
- చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్న అధికారులు



హైదరాబాద్ బయల్దేరేందుకు భద్రాచలంలో సిద్ధంగా ఉన్న ప్రైవేట్ బస్సులు

భద్రాచలంఅర్బన్: దసరా సెలవుల్లో ప్రైవేట్ బస్సుల నిర్వాహకులు దండుకుంటున్నారు. టికెట్ ధరలు రెండు, మూడింతలు పెంచేశారు. ముందస్తు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నా.. ప్రయాణికుల వరకు తీసుకెళ్లడంలో విఫలమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి. సర్వీసుల సంఖ్య ప్రకటించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే అవకాశం ప్రైవేటు ఆపరేటర్లకు కాసుల పంటగా మారుతోంది.

సాధారణ రోజుల్లో..

ఈ నెల 21 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. దీంతో రాజధాని తదితర ప్రాంతాల్లో ఉన్నవారు సొంతూళ్లకు వస్తున్నారు. ఆర్టీసీలో భద్రాచలం-హైదరాబాద్ టికెట్‌కు సాధారణ రోజుల్లో నాన్ ఏసీ ఎక్స్‌ప్రెస్ రూ.470, నాన్ ఏసీ సూపర్ లగ్జరీ టికెట్ ధర రూ. 650, డీలక్స్ రూ. 570గా, ఏసీ రాజధాని రూ.800, లహరీ బస్సులో సిట్టింగ్‌రూ.820, స్లీపర్‌కు రూ.1018 వసూలు చేస్తున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్‌లో..

ప్రైవేటు ట్రావెల్స్‌లో భద్రాచలం–హైదరాబాద్ టికెట్ నాన్ ఏసీ బస్సులో సిట్టింగ్‌కు రూ. 450 తీసుకుంటారు. స్లీపర్ రూ. 650, ఏసీ సర్వీసులకు రూ.819 పైగా వసూలు చేస్తున్నారు. పండుగ సందర్భంగా టికెట్ ధర అమాంతం పెంచారు. నాన్ ఏసీ బస్సులకు స్లీపర్ రూ.1400, సిట్టింగ్ అయితే రూ. 1000, ఏసీ బస్సుల్లో స్లీపర్ రూ. 1400కు పైగా వసూలు చేస్తున్నారు. పండుగ అనంతరం తిరిగి వెళ్లే సమయంలో ఇదే చార్జీ వసూలు చేస్తారు.

పట్టించుకోని రవాణాశాఖ

ఇటీవల కాలంలో ట్రావెల్స్ బస్సులను రవాణాశాఖాధికారులు తనిఖీలు చేయడంలేదు. భద్రాచలం మీదుగా హైదరాబాద్ వెళ్తున్న ఏ ఒక్క ప్రైవేట్ బస్సునూ గోదావరి బ్రిడ్జి పాయింట్‌లో ఉన్న చెక్ పోస్ట్ వద్ద తనిఖీ చేసిన సందర్భం లేదు. దీంతో పరిమితికి ప్రయాణికులను ఎక్కించడంతోపాటు గంజాయి వంటి నిషేధిత ఉత్పత్తులను కూడా తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తనిఖీలు చేస్తాం



ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలు నిర్వహిస్తాం. బస్సుల్లో ప్రయాణికులు లగేజీ మాత్రమే తీసుకెళ్లాలి. బస్సులకు సంబంధించిన పర్మిట్, ట్యాక్స్, డ్రైవింగ్ లైసెన్స్, రవాణాపై దృష్టి సారించి నిబంధనలు అతిక్రమించిన బస్సుల యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తాం.

–వెంకట పుల్లయ్య, ఎంవీఐ, భద్రాచలం

యూరియా లారీ అడ్డగింత

ఎనిమిది గంటలపాటు రైతుల నిరసన



యూరియా లారీని అడ్డుకుంటున్న రైతులు

బూర్గంపాడు: యూరియా సరఫరాలో జరుగుతున్న జాప్యంపై రైతులు కన్నెర్రజేశారు. గురువారం మండల పరిధిలోని నాగినేనిప్రోలు సొసైటీ గోదాంలో ఐదు టన్నుల యూరియా దిగుమతి, మిగతా యూరియాను మణుగూరు తరలిస్తుండగా లారీని రైతులు అడ్డుకున్నారు. నాగినేనిప్రోలు రెవెన్యూ పరిధిలో నాలుగు వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములుంటే ఇప్పటివరకు ఎన్ని యూరియా బస్తాలు ఇచ్చారని, దిగుమతి చేసిన 120 బస్తాల యూరియాను ఎంత మందికి ఇస్తారని ప్రశ్నించారు. సొసైటీ సిబ్బంది కూడా యూరియా పంపిణీలో వివక్ష చూపుతున్నారని, పరపతి ఉన్న రైతులకే ఇస్తున్నారని ఆరోపించారు. ఏ రైతుకు ఎంత యూరియా ఇచ్చారో లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు. రెండునెలలుగా తిరుగుతున్నా యూరియా మాత్రం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 8 గంటలపాటు లారీని అడ్డుకోగా, సొసైటీ సీఈఓ, వ్యవసాయ అధికారులు పలుమార్లు రైతులతో మాట్లాడారు. మణుగూరుకు వచ్చిన యూరియాను ఇక్కడ దిగుమతి చేయటం అసాధ్యమని, ఒకట్రెండు రోజుల్లో 20 టన్నుల యూరియాను నాగినేనిప్రోలులో దిగుమతి చేయిస్తామని లిఖితపూర్వక హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. దీంతో లారీని అధికారులు మణుగూరు పంపించారు.

జూనియర్ కళాశాలలో తనిఖీ

చర్ల: చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రెటరీ హేమచంద్ర గురువారం తనిఖీ చేశారు. కళాశాలలో ఉన్న వసతులను పరిశీలించారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పేరెంట్స్ అండ్ టీచర్స్ మీట్ ఏర్పాట్లపై ఆరా తీశారు. కళాశాల అభివృద్ధికి అధ్యాపకులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

గుడిపాడు పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ..

పాల్వంచ: పట్టణంలోని గుడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి తనిఖీ చేశారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య పనులు చేశారు. అనంతరం బాధితులతో మాట్లాడి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ, స్టోర్, ల్యాబ్‌ను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో వ్యక్తి గల్లంతు

చర్ల: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి చెరువులో మునిగి గల్లంతైన ఘటన గురువారం జరిగింది. మండలంలోని క్రాంతిపురానికి చెందిన నలుగురు వ్యక్తులు చర్లలోని సాలెబజార్ సమీపంలో ఉన్న చెరువులో చేపల వేటకు వెళ్లారు. వీరిలో గాలం వేసి చెరువులోకి దిగిన మిడియం మల్లయ్య (26) ఒక్కసారిగా మునిగిపోయాడు. మిగిలిన ముగ్గురు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ సంఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలను సేకరించారు. మల్లయ్య కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.